teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 146 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 20 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## పీఎం కిసాన్ 21వ విడత విడుదల

9 కోట్ల మంది రైతులకు రూ. 18,000 కోట్లకు పైగా బదిలీ


ప్రధాని చేతుల మీదుగా అన్నదాతలకు ఆర్థిక సాయం



02




## హిందూ మహిళలు మేల్కోవాలి



హిందూ మహిళల ఆస్తి వారసత్వంపై "సుప్రీం కోర్ట్ కీలక వాఖ్యలు"

పిల్లలు లేకుంటే భర్త కుటుంబానికే ఆస్తి

వివాదాలు తప్పాలంటే వీలునామా రాసుకోవాలి

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం తప్పనిసరి



తెలంగాణ పంచాయతీ

## ఎన్నికలకు కసరత్తు

ఓటర్ల జాబితా చివరి సవరణ షెడ్యూల్ విడుదల

నవంబర్ 23 వరకు నాలుగు రోజుల ప్రత్యేక డ్రైవ్

ఓటర్లకు ఎస్ఈసీ సూచనలు

.. వివరాలు 2లో



## ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం

గ్రామీణ, పట్టణాల్లో కోటి చీరలు

కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారి

విడతల వారిగా జరగనున్న పంపిణీ

.. వివరాలు 2లో

నేడు హైకోర్టులో ఇందిరమ్మ ఇల్లు

## లబ్ధిదారురాలి రిట్ పిటిషన్ విచారణ

జీవోలు, రాజ్యాంగ విరుద్ధ చర్యలపై న్యాయపోరాటం

అధికార బలంతో జరిగిన అన్యాయాన్ని కోర్టు ముందు పెట్టాం

న్యాయవాది కిరణ్ కుమార్ రొడ్డ

రాజకీయ అహంకారానికి ఈ కేసు గుణపాఠం కావాలి

పిటిషనర్ తరపు న్యాయవాది డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సంబంధించిన సంక్షేమ పథకాలలో ఇందిరమ్మ ఇల్లు పథకం ఒకటి. ఇందిరమ్మ ఇల్లు పథకానికి అర్హురాలు ఐన లబ్ధిదారురాలు జవ్వాజి సుమలత అన్యాయంగా

మిగతా 2 లో






పొగమంచులో

## జాగ్రత్త..

పొగమంచు ప్రమాదాలపై పోలీసుల హెచ్చరికలు

పాదాచారుల, వాహనదారులకు భద్రతా సూచనలు

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): నగరవాసులకు సైబరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. శీతాకాలం పొగమంచుతో ప్రమాదాల ముప్పు పెరుగుతుండడంతో ఈ కింది సూచనలను, మార్గదర్శకాలను పాటించాలని

మిగతా 2 లో

సింగరేణి బొగ్గు బ్లాకుల

## వేలం ఆపండి

- తెలంగాణ జాగృతి చీఫ్ కవిత డిమాండ్
- సింగరేణి భవన్ వద్ద ఉద్రిక్తత
- భవన్‌ను ముట్టడి నేపథ్యంలో కవిత అరెస్ట్



02



తెలంగాణ స్టార్టప్‌ల కోసం

## 1000 కోట్ల ఫండ్ ఏర్పాటు

లీడింగ్ గ్లోబల్ AI హబ్‌గా తెలంగాణ లక్ష్యం

ఐటీ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకోసం కోసం ₹1000 కోట్ల ఫండ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్ర ఐటీ డిపార్ట్‌మెంట్ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ వివరాలు వెల్లడించారు. కాగా వచ్చే జనవరిలో ఈ ఫండ్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను బూస్ట్ చేసేందుకు ఈ ఫండ్

మిగతా 2 లో

## సైబర్ నేరాలకు చెక్ పడుతుందా..?

50 లక్షల మంది సమాచారం డార్క్ వెబ్‌కు విక్రయం

- ఐబొమ్మ కేసుపై సీవీ ఆనంద్ విశ్లేషణ
- ఈజీ మనీ కోరిక తగ్గించుకోవాలి
- నివారణ చర్యలే ఏకైక మార్గం
- జీవితంలో ఏదీ ఉచితంగా రాదు
- ఐబొమ్మ పైరసీపై సీవీ ఆనంద్ హెచ్చరిక
- వ్యక్తిగత భద్రతే ప్రధానం
- హెూంశాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): సినిమాలను పైరసీ చేస్తూ ఇండస్ట్రీని బెంబేలెత్తించిన ఐబొమ్మ నిర్వాహకులు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో అతను 50 లక్షల మందికి చెందిన సమాచారాన్ని

మిగతా 2 లో



మహిళా విధానాల రూపకల్పనపై

## సర్కార్ ఫోకస్

- మార్చి 8 నాటికి కొత్త పాలసీ ప్రకటన
- సమగ్ర నివేదికకు శ్రీకారం
- మహిళా రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): విద్య, ఉపాధి, ఉద్యోగాలు, భద్రత వంటి రంగాల్లో మహిళలకు ఏలాంటి సౌకర్యాలు అవసరమో తెలుసుకుని, సమగ్ర నివేదిక

మిగతా 2 లో

## వృద్ధులకు జెరియాట్రిక్ సేవలు విస్తరణ

మంత్రి దామోదర్ రాజనర్సింహ

అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో జెరియాట్రిక్ సేవలు

వృద్ధులకు సేవలను విస్తరించాలని నిర్ణయం



04

# నేడు హైకోర్టులో ఇందిరమ్మ ఇల్లు "లబ్ధిదారురాలి రిట్ పిటిషన్ విచారణ"

మొదటి పేజీ తరువాయి

భావించి దాఖలు చేసిన రిట్ పిటిషన్ నేడు గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణకు రానుంది. ఈ కేసు రాష్ట్రంలో ప్రభుత్వ జీవోలు, రాజ్యాంగ నియమాలు మరియు చట్టాలకు విరుద్ధంగా పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని హైలైట్ చేయనుండడంతో దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

**న్యాయవాది కిరణ్ కుమార్ రొడ్డ వెల్లడి**

పిటిషనర్ జవ్వాజి సుమలత తరపు న్యాయవాది కిరణ్ కుమార్ రొడ్డ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కేసు యొక్క ప్రాముఖ్యతను మరియు న్యాయ పోరాట ఉద్దేశాన్ని వివరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) మరియు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధంగా, అలాగే నిబంధనలకు విరుద్ధంగా తమ క్లయింట్ జవ్వాజి సుమలతకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో తీవ్రమైన అన్యాయం జరిగింది. ఈ అన్యాయాన్ని కోర్టు వారి ముందు ఆధారాలతో సహా సమర్పించాము, అని న్యాయవాది కిరణ్ కుమార్ రొడ్డ తెలిపారు.

**రాజకీయ దురహంకారంపై గుణపాఠం**

పేదలకు న్యాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని న్యాయవాది కిరణ్ కుమార్ రొడ్డ స్పష్టం చేశారు. పేద ప్రజల పట్ల రాజకీయాధికార దురహంకారంతో, అధికార బలంతో విర్రవీగుతున్న నాయకులకు ఈ కేసు ఒక గుణపాఠంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ పదవిలో ఉన్న వ్యక్తులు రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి. చట్టబద్ధతను విస్మరించి రాజకీయ ప్రయోజనాల కోసం పేద ప్రజల హక్కులను కాలరాస్తే, వారికి న్యాయస్థానంలో తప్పక సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ రిట్ పిటిషన్ ద్వారా పేద ప్రజల పట్ల పాలకుల వైఖరిని ప్రశ్నించడమైనది అని కిరణ్ కుమార్ రొడ్డ గట్టిగా నొక్కి చెప్పారు.

**కేసు నేపథ్యం మరియు ప్రాముఖ్యత**

ఇందిరమ్మ ఇల్లు పథకం పేదలకు గృహాలను అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టబడింది. అయితే, అనేక ప్రాంతాలలో రాజకీయ జోక్యం, పక్షపాతం కారణంగా అర్హులైన లబ్ధిదారులు అన్యాయానికి గురవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జవ్వాజి సుమలత కేసు అటువంటి అన్యాయాలకు ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, హైకోర్టు ప్రభుత్వ జీవోల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, మరియు ప్రభుత్వ అధికారుల నిర్ణయాల చట్టబద్ధతను పరిశీలించనుంది.

హైకోర్టు ఇచ్చే తీర్పు, రాష్ట్రంలోని ఇతర అర్హత గల లబ్ధిదారులకు న్యాయం దిశగా ఒక కీలకమైన మైలురాయిగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, సమానత్వం మరియు న్యాయబద్ధత పాటించడం యొక్క ఆవశ్యకతను ఈ కేసు మరోసారి రుజువు చేస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేడు జరగబోయే విచారణ ఫలితం కోసం లబ్ధిదారులు మరియు సామాజిక కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## సైబర్ నేరాలకు చెక్ పడుతుందా..?

మొదటి పేజీ తరువాయి

డార్క్ వెబ్ కు అమ్మినట్లుగా తేలింది. దీంతో ఐబొమ్మ వెబ్ సైట్ ను విజిట్ చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇకనైనా పైరసీ ఆగుతుందా? సైబర్ క్రైమ్ కు చెక్ పడుతుందా? అని తలెత్తుతున్న సందేహాలపై రాష్ట్ర హోంశాఖ స్పెషల్ సీఎస్ సీవీ ఆనంద్ ఎక్స్ వేదికగా స్పందించారు. హ్యాకర్లు, హ్యాకింగ్ అనేవి కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఒకడు పోతే మరొకడు వస్తాడని, వాడు కూడా మరింత టెక్నాలజీని ప్రదర్శిస్తాడని పేర్కొన్నారు. కొందరిని అరెస్ట్ చేశామన్న కారణంతో పైరసీ లేదా సైబర్ క్రైమ్స్ పూర్తిగా ఆగిపోతాయని అనుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. పెద్ద పెద్ద దొంగతనాలకు పాల్పడిన సాంకేతిక నైపుణ్యం ఉన్న దొంగల గ్యాంగ్స్ ను పట్టుకున్న తర్వాత దొంగతనాలు, చోరీలు, దాడులు, మోసాలు ఆగిపోయాయా? మనిషి ఉన్నంతకాలం ఈ రకాల నేరాలు కూడా జరుగుతూనే ఉంటాయని తెలిపారు. వీటికి మన చేతిలో ఉన్న మార్గం నివారణ ఒక్కటేనని హితవు పలికారు. ఈజీ మార్గాల్లో డబ్బు సంపాదించాలన్న కోరికలను తగ్గించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ పెరగడానికి ఆ కోరికే మూలకారణమని సీవీ ఆనంద్ తెలిపారు. సైబర్ స్పేస్, అకౌంట్లను సేఫ్ గా ఉంచుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఏదీ ఫ్రీగా రాదని డైరెక్టర్ రాజమౌళి చెప్పిన మాటే జీవిత సత్యమని పునరుద్ఘాటించారు.

## సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం ఆపండి

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కార్యకర్తలు, హెచ్ఎంఎస్ సింగరేణి యూనియన్ నాయకులతో కలిసి బుధవారం నగరంలోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలోనే అప్రమత్తమైన పోలీసులు ముట్టడిని అడ్డుకున్నారు. సింగరేణి భవన్ ఎదుట బైఠాయించిన కవితతో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. కొత్త బ్లాకులను సింగరేణికి మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇది సింగరేణి సంస్థ ఆర్థిక స్థిరత్వానికి కీలకమని కామెంట్ చేశారు. అదేవిధంగా సింగరేణి కార్మికుల జీతాల నుంచి ఆదాయపు పన్ను వసూళ్లను ఆపాలని దీంతో కార్మికులపై భారం తగ్గుతుందని పేర్కొన్నారు. సింగరేణి పరిధిలోని ప్రతి కాంట్రాక్ట్‌లో 25 శాతం అవినీతి జరుగుతోందని, 10 శాతం వాటా కాంగ్రెస్ నాయకులకు వెళ్తోందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే సీబీఐకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇక రెండేళ్లుగా మెడికల్ బోర్డు కోసం కార్మికులతో కలిసి పోరాడుతున్నామని, ఇది వారి ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను కూడా తీసేయడం దారుణమని కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు.

## మహిళా విధానాల రూపకల్పనపై సర్కార్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

రూపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను పూర్తిగా తొలగించేందుకు నిపుణులు, మేధావులు, అధికారులు ఇచ్చే సూచనలు అత్యంత ఉపయోగకరమవుతాయని పేర్కొన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉమెన్ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు, వివక్ష నిర్మూలన, లింగ సమానత్వం, మహిళల భద్రత, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. నిపుణుల అభిప్రాయాలు, సూచనలు, అనుభవాలను ప్రభుత్వం తెలుసుకుని భవిష్యత్ విధానాల్లో ప్రతిబింబింపజేయాలనే ఉద్దేశంతో రౌండ్ టేబుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళా సంక్షేమం, భద్రత కోసం చట్టాలు ఉన్నప్పటికీ, సమాజపు పోకడల కారణంగా అవి ప్రాక్టికల్‌గా అమలుకావడంలో సమస్యలు వస్తున్నాయని, పని ప్రాంతాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలను చెప్పుకునే అవకాశాలు కోల్పోతున్నారని వివరించారు. ఈ చర్చ రాజకీయ కార్యక్రమం కాదని, మహిళల భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక ఘట్టం అని మంత్రి స్పష్టం చేశారు.

**మార్చి 8 నాటికి కొత్త విధానం**

రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో వచ్చిన సూచనలు, సలహాలు ఆధారంగా త్వరలో విస్తృత స్థాయి సదస్సును ఏర్పాటు చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి ఒక కొత్త మహిళా విధానాన్ని రూపకల్పన చేస్తామని వెల్లడించారు. ఆడపిల్లల ఆరోగ్యం, వంద శాతం విద్య సాధన, మహిళల ఆర్థిక స్వావలంబన, మాతృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలో అమలయ్యేలా చూడటం, తండ్రులూ పిల్లల పెంపకంలో భాగస్వామ్యం కావడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. పాఠశాలల్లో అమ్మాయిలను గౌరవించే సంస్కారాన్ని పెంపొందించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఈ సమావేశం తెలంగాణలో మహిళా సాధికారతకు పునాది వేసే తొలి మెట్టుగా నిలిచిపోతుందని మంత్రి సీతక్క విశ్వాసం వ్యక్తం చేశారు. రేపటి తరం కోసం నేటి మేధోమదనం ఎంతో అవసరమని పేర్కొంటూ, తెలంగాణను మహిళా సాధికారతలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## తెలంగాణ స్టార్టప్‌ల కోసం '1000 కోట్ల ఫండ్ ఏర్పాటు"

మొదటి పేజీ తరువాయి

ఉపయోగపడుతుందన్నారు. ఏఐ పై పనిచేసే స్టార్టప్స్‌పై ఫోకస్ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణను లీడింగ్ గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చడమే తమ లక్ష్యమని సీఎస్ సంజయ్ కుమార్ చెప్పారు. కాగా ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకం వల్ల హైదరాబాద్ లో మరిన్ని స్టార్టప్ సంస్థలు నెలకొల్పడమే కాకుండా అనేక ఉద్యోగాలకు అవకాశం ఉంటుందని ఐటీ నిపుణులు చెబుతున్నారు.



## పొగమంచులో జాగ్రత్త..

మొదటి పేజీ తరువాయి

బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాదాచారుల కోసం పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గిపోతుంది. ఇది ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది. అందుకే పాదాచారులు అత్యవసరమైతే మాత్రమే రోడ్లపైకి రావాలి.

**ద్విచక్ర వాహనదారుల కోసం**

వేగం తగ్గించాలి పొగమంచు వల్ల ముందున్న వాహనాలు కనిపించకపోవచ్చు, అందుకే మిత వేగంతో ప్రయాణించాలి.

**లైట్లు ఆన్‌లో ఉంచాలి**

వాహనం ముందు -వెనుక లైట్లు ఆన్‌లో ఉంచడం ద్వారా ఇతర వాహనదారులకు మీరు కనిపించగలుగుతారు.

**రిఫ్లెక్టివ్ దుస్తులు ధరించాలి:**

ఇవి వెలుతురు పడినప్పుడు మెరుస్తాయి, తద్వారా మీరు స్పష్టంగా కనిపిస్తారు.



**హెల్మెట్ వైజర్‌ను శుభ్రంగా ఉంచాలి:**

పొగమంచు, తేమ వల్ల వైజర్ మసకబారవచ్చు. స్పష్టంగా కనిపించేందుకు తరచూ శుభ్రం చేయాలి.

**ORR&హైవేల్లో ప్రయాణించే వారికి లేన్ మార్చవద్దు:**

పొగమంచు వల్ల ఇతర వాహనాలు కనిపించకపోవచ్చు. లేన్ మారడం ప్రమాదకరం.

**బ్రేక్ సాఫీగా వాడాలి:**

అకస్మాత్తుగా బ్రేక్ వేయడం వల్ల వెనుక వాహనాలు ఢీకొట్టే ప్రమాదం ఉంది.

ఏమర్జెన్సీ పరిస్థితుల్లో ఎడమ లేన్‌లో వాహనం ఆపాలి:

ఇది ఇతర వాహనాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు అవసరం.

ఈ మార్గదర్శకాలు, సూచనలు ప్రజల భద్రత, ప్రమాద నివారణ, రవాణా సౌకర్యం కోసం రూపొందించబడ్డాయడని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం చెబుతోంది. పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉన్న ఉదయం, రాత్రి సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని అంటోంది.

## హిందూ మహిళలు మేల్కోవాలి

న్యూ ఢిల్లీ, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): గత కొద్ది సంవత్సరాలుగా దేశంలోని హిందూ మహిళల ఆస్తి వారసత్వంపై తరచూ వివాదాలు తలెత్తుతున్న విషయం తెలిసిందే. దీంతో మహిళల ఆస్తి పంపకాలపై తరుచు ఇరు కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తి ఎవరికి వెళ్లాలి అనేది స్పష్టంగా ఉండాలంటే వీలునామా తప్పనిసరిగా రాసుకోవాలని కోర్టు సూచించింది. పిల్లలు లేని పరిస్థితిలో, ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం, మహిళ ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తు చేసింది. దీంతో చాలా సందర్భాల్లో మహిళ తల్లిదండ్రుల కుటుంబం, అత్తింటి వారి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని మండిపడింది. మహిళ గోత్రం వివాహానంతరం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ, వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది. ఈ కారణంగా వారసత్వ హక్కుల్లో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రీ-లిటిగేషన్ మిడియేషన్ (మధ్యవర్తిత్వం) తప్పనిసరి చేయాలని కోర్టు ఆదేశించింది. మధ్యవర్తిత్వంలో వచ్చే ఒప్పందాలను కోర్టు తీర్పు (డిక్రీ)గా పరిగణించాలని తెలిపింది. కొంతమంది న్యాయవాదులు ప్రస్తుత వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) వివక్షాత్మకమని అభిప్రాయపడుతున్నప్పటికీ, ఈ చట్టాన్ని సవరిస్తే అది పార్లమెంట్ చేయాల్సిన పని మాత్రమేనని కోర్టు స్పష్టం చేసింది.

## తెలంగాణ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వేగంగా కసరత్తు చేపట్టింది. ఈ క్రమంలో పంచాయతీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మరోసారి సవరించేందుకు షెడ్యూల్‌ను ఎస్ఈసీ బుధవారం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో నేటి నుంచి నవంబర్ 23 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనుంది. ఈ నాలుగు రోజుల్లో గ్రామాల్లో ఓటర్ల జాబితాలను ఇంటింటి స్థాయిలో పరిశీలించి, కొత్తగా అర్హత సాధించినవారి పేర్లు చేర్చడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, ఇతర సవరణలు చేపట్టనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, స్థానిక సర్పంచ్‌ల సహకారంతో ఈ ప్రక్రియ జరుగనుంది. కాగా, ఓటర్లు తమ పేరు జాబితాలో ఉందో లేదో తెలుసుకోవడానికి, అవసరమైన సవరణలు చేయించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈసీ సూచించింది. ఇప్పటికే జులై 1, 2025 నాటి అర్హతతో రూరల్ ఓటర్ల జాబితా తుది రూపం పొందగా, ఈ చివరి సవరణ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, డిసెంబర్ చివరి వారంలో లేదా 2026 జనవరి మొదటి వారంలో పోలింగ్ జరగవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ఓటర్లు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, రాబోయే నాలుగు రోజుల్లో తప్పనిసరిగా జాబితా పరిశీలించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది.

## ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరుతో రాష్ట్రంలోని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 35 లక్షల చీరలు పంపిణీ చేయబోతున్నట్లు తెలిపారు. బుధవారం సెక్రటేరియట్‌లో కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. పూర్తి వివరాలతో ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఒక పండగ వాతావరణంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని సూచించా రు. ఇందిమ్మ క్యాంటీన్లు, శిల్పారామంలో 3 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని ఆన్ లైన్ మార్కెట్ కోసం అమెజాన్ తో సంప్రదింపులు చేస్తున్నామని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం నుంచి డిసెంబర్ 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందని, మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందన్నారు.

## పీఎం కిసాన్ 21వ విడత విడుదల

**9 కోట్ల మంది రైతులకు రూ. 18,000 కోట్లకు పైగా బదిలీ**

**ప్రధాని చేతుల మీదుగా అన్నదాతలకు ఆర్థిక సాయం**

న్యూ ఢిల్లీ, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): దేశంలోని అన్నదాతలకు ప్రధాని నరేంద్ర మోడీ శుభవార్త చెప్పారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 21వ విడత నిధులను విడుదల చేశారు. తమిళనాడు పర్యటనలో ఉన్న ప్రధాని బుధవారం కోయంబత్తూర్లోని కార్యక్రమంలో 9 కోట్ల మంది లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ.18, వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేశారు. కాగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనను ఫిబ్రవరి 24, 2019 న ప్రారంభించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన దేశంలోని రైతు కుటుంబాలకు ఏడాదికి రూ. 6,000 ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఒక్కో విడతలో రూ. 2 వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తోంది.

## ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ దసరా నాటికి పూర్తి

**మేడారం జాతర నాటికి అందుబాటులోకి బీటీ రోడ్డు**

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం**

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): ఎట్టి పరిస్థితుల్లోనూ ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను వచ్చే దసరా నాటికి పూర్తి చేస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా బుధవారం నాడు ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్ అధికారులకు, నిర్మాణ సంస్థకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే బిటి రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్- వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బి.టి రోడ్డు పనులు మొదలు పెట్టారు. ఈ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5 కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మేడారం జాతర ప్రారంభం వరకు బి.టి రోడ్డు పనులను అత్యంత నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. బి.టి రోడ్డు పనులు, ఎలివేటెడ్ కారిడార్ పనులు పగలు, రాత్రి షిఫ్టుల వారిగా శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్- నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

# వయోవృద్ధులే మనదేశానికి వెలకట్టలేని సంపద

## వారి హక్కులను ప్రతీ ఒక్కరు గౌరవించాలి

### జిల్లా సంక్షేమ అధికారి శ్రీ తుల రవి




ములుగు జిల్లా, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం 2025 ను పురస్కరించుకొని “వయోవృద్ధులు స్థానిక మరియు ప్రపంచ చర్యను నడిపిస్తున్నారు. మా ఆశయాలు, మా శ్రేయస్సు మరియు మా హక్కులు అనే థీమ్ తో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ వారోత్సవాల్లో భాగంగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్జెండర్ల సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి నుండి కలెక్టరేట్ వరకు వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం పై అవగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి శ్రీ తుల రవి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడం జరిగింది. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన వయోవృద్ధులు, వివిధ సమన్వయ శాఖల సిబ్బంది ర్యాలీ పూర్తిచేసిన అనంతరం కలెక్టరేట్ ముందు మానవహారం ఏర్పాటుచేసి అంతా వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం సంక్షేమాధికారి గారి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి శ్రీ తుల రవి మాట్లాడుతూ వయోవృద్ధులే మనదేశానికి వెలకట్టలేని సంపద అని,

వారే మన భవిష్యత్తుకు బలమైన పునాది అని, అలాంటి వారిని బలహీనులుగా చూడకుండా వారి హక్కులను ప్రతీ ఒక్కరు గౌరవించాలి అని అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్న కాలంలో పెద్దలు అంటే సమాజంలో ఎంతో గౌరవం ఉండేదని, ప్రస్తుతం నేటి ఉరుకుల పరుగుల సమాజంలో వయో వృద్ధులు వృద్ధాశ్రమాల్లో ఉండే పరిస్థితి రావడం బాధాకరం అని అన్నారు. మన ములుగు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వయో వృద్ధులైన తల్లితండ్రులను పట్టించుకోని వారసుల నుండి పట్టాలను రద్దు చేసి మళ్లీ తిరిగి ఆ వయోవృద్ధులైన తల్లితండ్రుల పేరు మీదనే పట్టాలను మంజూరీ చేయడం జరిగిందని అన్నారు. వయోవృద్ధులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమ ఫోరం జిల్లా అధ్యక్షులు పాశం రామ్మూర్తి గారు మాట్లాడుతు మంత్రి, జిల్లా కలెక్టర్ ములుగు జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవడం ఎంతో సంతోషకరం అని, వయో వృద్ధుల రక్షణ పోషణ చట్టం ఏర్పాటులో కూడా వారి యొక్క సహకారం ఇదేవిధంగా ఉండాలని కోరారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ తరపున వయోవృద్ధులకు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు, కవితా పోటీలు వంటివి ఏర్పాటుచేయడం జరిగిందని, వీటివల్ల వయోవృద్ధుల శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ క్రీడలు పోటీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు.

మాకు అన్ని విధాలుగా సహకరించి ఈ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి శ్రీ తుల రవికి ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ ఫోరం ములుగు తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ తరపున మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసి వయోవృద్ధుల వాడి పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ చేయడం జరిగింది.

# బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్




మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): బ్యాంకర్లు జిల్లా అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి జిల్లా లక్ష్యాలను సాధించాలని, రుణాల పంపిణీలో నిర్దేశిత పూర్తి స్థాయిలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని, కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సూచించారు. పంట, హార్టికల్చర్, సెరికల్చర్, ముద్ర, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్, పీఎంఈజీపి, స్వయం సహాయక బృందాల లింకేజ్, పీఎం స్వనిది, తదితర రుణాలు పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది, జిల్లా లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే రానున్న సీజన్ లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు క్రాఫ్ లోన్స్ 43,91 శాతం, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ 57.96 శాతం, స్వయం సహాయక సంఘాల రుణాలు 47.99 శాతం లక్ష్యాలను పీఎం స్వనిది 99.53 శాతం పూర్తి చేశారన్నారు,

పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉ ండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ, వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించాలని అన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర పశు సంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర శాఖలతో సమన్వయము చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించి స్వయం ఉ పాధికి చేయూతనివ్వాలన్నారు, రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని,సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు.వీధి వ్యాపారులకు విరివిగా ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద రుణాలు అందించాలన్నారు. కూరగాయలు పంటల (హార్టికల్చర్) విభాగం కు చెందిన రుణాలను త్వరగా రైతులకు అందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, ఆర్బీఐ ఎల్.డీ.ఓ డిబోజిత్ బారువ,

డీఆర్డీఓ మధుసూదన రాజు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కె .యాదగిరి, నాబార్డు ఏజీఎం చైతన్య రవి,డిఏఓ విజయనిర్మల, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ జి.మరియాన్న, మెప్మా పీడీ విజయ, ట్రైబల్ వెల్ఫేర్ దేశి రామ్ నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, యుబీఐ డీజీఎం కమలాకర్, డిసీసీబి బి.కృష్ణమోహన్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ షరీఫ్, వేణు,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# పిడిఎస్యు 23వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

### హనుమకొండ ఆర్ట్స్ కాలేజ్ సెంటర్లో వాల్ రైటింగ్ ప్రారంభించిన మాజీ జిల్లా అధ్యక్షులు రాచర్ల బాలరాజు




హనుమకొండ, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): పిడిఎస్యు 23వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, ఈరోజు సుబేదారి ఆర్ట్స్ కాలేజ్ వద్ద వాల్ రేటింగ్ ని పిడిఎస్యు నాయకులు కార్యకర్తలు వాల్ రైటింగ్ చేశారు. పి డి ఎస్ యు వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు రాచర్ల బాలరాజు వాల్ రైటింగ్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 10,11,12 వ తేదీలలో విప్లవాల కిల్ల వరంగల్ జిల్లాలో నిర్వహించబోయే తెలంగాణ రాష్ట్ర 23వ పిడిఎస్యు మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థి మేధావి వర్గాలను ఆయన కోరారు.ఈ సభల విజయవంతం కోసం ఆర్థికంగా హార్దికంగా సకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పిడిఎస్యు అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ జిల్లా నాయకులు అజయ్, రాజేష్ అనిల్, కళ్యాణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు చీరలు పంపిణీ చేయాలి

### ఆడబిడ్డలకు సారె చీరె అందించడం తెలంగాణ సాంప్రదాయం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ములుగు జిల్లా, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులందరికీ సకాలంలో చీరలను పంపిణీ చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలకు సారే, చిరే ఇవ్వడంసాంప్రదాయమని రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకాటి శ్రీహరి, సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులు ఉద్దేశించి మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలో కోటి మంది మహిళలకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించడం జరిగిందని, పండుగ వాతావరణంలో చీరలను పంపిణీ చేయాలని సూచించారు. మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి అని, డిసెంబర్ 9 నాటికిపూర్తిస్థాయిలో చీరలను పంపిణీ చేయాలని ఆదేశించారు. వీడియో సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులందరికీ చీరలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు.

# పుస్తకాలు రాజ్యమేలినప్పుడే రుగ్మతలన్నింటికీ పరిష్కారం

### క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి అజయ్



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం హై స్కూల్, కాలేజ్ స్థాయి విద్యార్థినిలకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.అజయ్ మాట్లాడుతూ పుస్తకాలు రాజ్యమేలినప్పుడే నేటి సమాజంలోని రుగ్మతలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అన్నారు. నాడు స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచినవి గ్రంథాలయలే, ఆనాడు గ్రంథాలయాలలోని పుస్తకాలు, పత్రికలు ప్రజలకు స్వతంత్ర భావన, సమానత్వం, గురించి తెలిపి వారిలో చైతన్యం కలిగించాయి. పౌర గ్రంథాలయాలు సామాజిక, సంస్థలు అనే నానుడికి అనుగుణంగా సమాజానికి సమాచార సేవలు అందిస్తున్నాయి. పేద అట్టడుగు వర్గాల్లో, పేదరిక నిర్మూలనకు, జీవితకాల అభ్యాసం కొరకు పాటు పడుతున్నాయి , ప్రజలు చైతన్యవంతంగా ఉండాలంటే గ్రంథాలయాల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని అన్నారు. ఏ దేశంలోనైనా ఏ ప్రాంతంలోనైనా గ్రంథాలయాలు అచ్చటి ప్రజల ఔన్నత్యానకి ప్రతీకలు. అంతేకాదు గ్రంథాలయాలను ఆలంబనంగా చేసుకొని ఎందరో నిరుద్యోగ యువత విజ్ఞానాన్ని పెంచుకొని ఉన్నంత శిఖరాలు చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు, జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బి భూలక్ష్మి, బి యాదమ్మ, రిటైర్ లైబ్రేరియన్ గూడ నరేందర్, సీనియర్ గ్రంథాలయ పాఠకులు గాదేం శ్యామ్ ప్రసాద్, అబ్బగాని భాస్కర్, పెరుగు కుమార్, వి రవి, సిహెచ్ వెంకన్న, అనిల్ జంపాల నారాయణ ,శారద తదితరులు పాల్గొన్నారు.

# అంగవైకల్యంతో పోరాడుతున్న బాలుడిని చూసి చలించిన ఖాకీ హృదయాలు



మామునూరు, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్పెషల్ పోలీస్ మామునూరు నాలుగో బెటాలియన్ కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు కె.విజయభాస్కర్ 1033, ఎ.ప్రవీణ్-276, జి.నాగరాజు 271 మేడారం పోలీస్ స్టేషన్లో విధులను నిర్వర్తిస్తున్నారు. మేడారంలో సాత్విక్ అనే బాలుడు అంగవైకల్యంతో మంచానికే పరిమితమయి బాధపడుతున్న దృశ్యాలను చూసి బాలుడికి ఏదో ఒక విధంగా సహాయం చేయాలనే సంకల్పంతో ఒక వీల్ చైర్ తీసుకొని ఆ బాలుడికి బహుమతిగా ఇవ్వగా ఆ బాలుడు మరియు అతని తల్లిదండ్రుల ఎంతగానో సంతోషపడ్డారు. పోలీసులు అంటే కఠిన మనస్కులు కాదని పోలీసులు కూడా మానవత దృక్పథంతో ప్రజలకు సేవ చేసే వారిని ఈ సంఘటన తెలియజేస్తుంది. పోలీసులకు ప్రజలలో మంచి పేరు తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి. వీరు చేసిన మంచి పనికి బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి వీరిని అభినందించారు.

# తెలంగాణ ఈశాన్య రాష్ట్రాల టెక్నో కల్చరల్ ఫెస్టివల్

## హైటెక్స్‌లో నేటి నుంచి ప్రారంభం
## రెండు దశల్లో ఉత్సవాల నిర్వహణ
## ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ప్రముఖులు




హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ వేదికగా తెలంగాణ- నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, ఏ టెక్నోకల్చరల్ ఫెస్టివల్ పేరిట సాంకేతిక, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపురల మధ్య సాంకేతిక, సాంస్కృతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, తద్వారా ఇరు ప్రాంతాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. హైటెక్స్ లో నవంబర్ 20 నుండి 22 వరకు, రాజ్ భవన్‌లో నవంబర్ 25 నుండి 27 వరకు రెండు విడతలుగా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం, ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈరోజు సాయంత్రం 5.30 గంటలకు హైటెక్స్ లో సంస్కృతుల సంగమం - సమృద్ధికి సోపానం అనే అంశంతో ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులు, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు, మంత్రులు హాజరుకానున్నారు.

### నేటి నుంచి 27 వరకు ఉత్సవాలు

మొదటి దశలో భాగంగా నేటి నుంచి 22 వరకు హైటెక్స్ లో లలిత కళలు, ప్రదర్శన కళలు ప్రదర్శిస్తారు. సాహిత్యం పై చర్చలు, ఫిల్మ్ ఫెస్టివల్ ఉంటుంది. సామాజిక అంశాల్లో భాగంగా మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి, స్వయం సహాయక బృందాల ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. యువతకు ప్రాధాన్యతనిచ్చేలా క్రీడా సంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండో దశలో భాగంగా నవంబర్ 25 నుండి 27 వరకు రాజ్ భవన్, ఫీల్డ్ విజిట్ ఉంటుంది. ఈ రెండు రోజుల్లో వైద్యం ఆరోగ్య శాస్త్రాలు, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్, ఐటీ అండ ఐటీఈఎస్ పై ప్యానెల్ చర్చలు జరుగుతాయి. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రులు, జీనోమ్ వ్యాలీ, టి-హబ్ ను సందర్శిస్తారు. నవంబర్ 27న రాజ్ భవన్‌లో ముగింపు వేడుకతో ఉత్సవం ముగుస్తుంది.

# సింగరేణి, ఎన్జీఈఎల్ మధ్య కీలక ఒప్పందం

## సోలార్ విద్యుత్ ఉత్పాదన 5 వేల మెగావాట్ల పెంపుకు లక్ష్యం
## మణుగూరులో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు యోచన



హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): సింగరేణి సంస్థ పునరుద్పాదక ఇంధన రంగంలో విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున చేపట్టబోతున్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పాదకతో పేరెన్నికగన్న పీఎస్‌యూ ఎన్టీపీసీ అనుబంధ కంపెనీ ఎన్జీఈఎల్ (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్)తో ఒక కీలక ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్‌తో పాటు సంస్థ డైరెక్టర్లు, ఎన్జీఈఎల్ తరపున ఉన్నతాధికారులు ఆర్. మౌర్య, బిమల్ గోపాల చారి పాల్గొన్నారు. ఒప్పంద వివరాలను సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ వివరించారు. సింగరేణి తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పలు పునరుద్పాదక ఇంధన రంగంలో ప్లాంట్లను నెలకొల్పాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జాతీయ స్థాయిలో విద్యుత్పాదనలో దశాబ్దాల అనుభవం ఉన్న ఎన్టీపీసీ సహకారాన్ని తీసుకోవాలని భావించామన్నారు. ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన కోసం ఏర్పాటు చేసిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, సోలార్ విద్యుత్తును 5 వేల మెగావాట్లకు పెంచాలని నిర్ణయించిందని, మణుగూరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ కూడా నిర్మించాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో, దాని అనుబంధ సంస్థ అయిన ఎన్జీఈఎల్ కంపెనీ తోనూ ఒప్పందం కుదుర్చుకోవడం ఒక శుభ పరిణామం అన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటులో సాంకేతిక సహాయం లేదా ఉమ్మడి భాగస్వామ్యం అంశం కూడా పరిశీలిస్తున్నామన్నారు. భవిష్యత్ లో సింగరేణి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తు విక్రయంలోనూ ఎన్టీపీసీ సహకారం తీసుకోనున్నామని తెలిపారు.

### గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులు వేస్తున్నాం

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలోకి కూడా ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామమని ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్జీఈఎల్ బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ బిమల్ గోపాలాచారి అన్నారు. తాము కూడా గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నామని ఇరువురి పరస్పర సహకారం మరియు భాగస్వామ్యంతో దేశ విదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఎన్జీఈఎల్ హెడ్ (సివిల్ ఇంజినీరింగ్) ఆర్.ఆర్.మౌర్య పేర్కొన్నారు. ఒప్పందం అనంతరం ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహిస్తామని ఇరు పక్షాలకు లాభదాయకమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. 13 దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణితో కలిసి నడవడం ఆనందంగా ఉందని అన్నారు.

# వృద్ధులకు జెరియాట్రిక్ సేవలు విస్తరణ

## మంత్రి దామోదర్ రాజనర్సింహ
## అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో జెరియాట్రిక్ సేవలు
## వృద్ధులకు సేవలను విస్తరించాలని నిర్ణయం



హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను కూడా విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జనరల్ హాస్పిటల్ల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జీవన ప్రమాణాలు పెరిగాయని, దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతున్నదని మంత్రి తెలిపారు. పిల్లల కోసం మనం ప్రత్యేకంగా చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక హాస్పిటళ్లు నిర్వహించాల్సిన అవసరం భవిష్యత్తులో మన దేశంలోనూ ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని హాస్పిటళ్లలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి జీజీహెచ్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదేనని మంత్రి ఆదేశించారు.

### డీఎంహెచ్‌వోలు, సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను మానిటర్ చేస్తున్నాం.

గత ప్రభుత్వం తరహాలో హాస్పిటల్, మెడికల్ కాలేజీ పేరిట అరకొర బిల్డింగులు కట్టి వదిలేయడం లేదని ప్రతి హాస్పిటల్‌లోనూ అవసరమైనమేర డాక్టర్లను, నర్సులను, ఇతర సిబ్బందిని నియమిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశామని మరో 7 వేలకుపైగా పోస్టులు భర్తీ అవుతున్నాయన్నారు. మ్యాన్ పవర్‌తో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. హాస్పిటల్స్ కు వచ్చే రోగులకు సేవలు అందించడం అధికారుల చేతుల్లోని ఉందన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లను కాపాడాల్సిన బాధ్యత డీఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్లదేనన్నారు. డీఎంహెచ్‌వోలు, హాస్పిటల్ సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను కూడా తాము మానిటర్ చేస్తున్నామని స్పష్టం చేశారు. సిబ్బంది అటెండెన్స్‌ను మీరు మానిటర్ చేస్తున్నారో లేదో కూడా గమనిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటామని అదే సమయంలో బాగా పని చేసే వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. హాస్పిటళ్లలో పాతుకుపోయి, పని చేయించే ఆఫీసర్లపై తప్పుడు ఆరోపణలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన వైద్య వ్యవస్థ కూడా మారాలని అందరూ కలిసి మార్చే ప్రయత్నం చేద్దామని మంత్రి కోరారు. ఒకప్పుడు కమ్యునికెబుల్ డిసీజెస్ ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్ లైఫ్‌స్టైల్ డిసీజెస్ ఎక్కువయ్యాయి. మన హాస్పిటళ్లను కూడా బీపీ, షుగర్, కేన్సర్, గుండె, కిడ్నీ జబ్బులు లైఫ్‌స్టైల్ డిసీజ్‌లకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించే విధంగా తయారు చేసుకుంటున్నాం. అన్ని జిల్లాల్లో ఎన్‌సీడీ క్లినిక్‌లు ప్రారంభించుకున్నాం, డే కేర్ కేన్సర్ సెంటర్లు పెట్టుకున్నాం, ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేసుకున్నాం, ఇప్పుడు జెరియాట్రిక్ సేవలు విస్తరించుకుంటున్నాం. భవిష్యత్తులో ఈ సేవలన్నింటినీ మరింత విస్తరించుకుంటూ ప్రజలకు ప్రభుత్వ హాస్పిటళ్లలోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

### రోగులను దోచుకునే హాస్పిటళ్లపై కఠిన చర్యలు తీసుకోండి.

ట్రీట్‌మెంట్ పేరిట ప్రజలను దోచుకునే ప్రైవేట్ హాస్పిటళ్లపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. ఐవీఎఫ్ సెంటర్లు, పెయిన్ క్లినిక్‌లు, రిహాబిలిటేషన్ సెంటర్ల పేరిట దోపిడీకి, అవకతవకలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడికల్ ఎడ్యుకేషన్, వైద్య విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, ఎన్‌హెచ్‌ఎం డిపార్ట్‌మెంట్ల నడుమ కోఆర్డినేషన్ ఉండాలన్నారు. ఎక్కడికి అక్కడ సమన్వయ కమిటీలను నియమించుకుని పని చేయాలని కోరారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోలీసులను చూడగానే నేరస్తులు భయపడినట్టు, వైద్యాధికారులను చూస్తే నిబంధనలు ఉల్లంఘించే హాస్పిటళ్ల యాజమాన్యాలు భయపడాలే పరిస్థితి ఉండాలన్నారు. కొన్ని జిల్లాల్లో సిజేరియన్ డెలువరీలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని తగ్గించి నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలన్నారు. సిజేరియన్ డెలివరీలు మాత్రమే చేస్తున్న ప్రైవేట్ హాస్పిటళ్లపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి పేషెంట్లను బయటకు రిఫర్ చేయొద్దని మంత్రి అన్నారు. సబ్ సెంటర్ నుంచి జీజీహెచ్ వరకూ అన్ని హాస్పిటళ్ల నడుమ సమన్వయం ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్‌ను అవసరమైనప్పుడు మరో ప్రభుత్వ హాస్పిటల్‌కు మాత్రమే రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



కొత్తపల్లి గోరి, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జన్మదిన శుభాకాంక్షలు జరుపు కున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు ఈర్ల శ్యామ్ ఆధ్వర్యంలో శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేయడం జరిగింది మరియు ఇందిరా గాంధీ గారు భారతదేశానికి చేసిన ఎన్నో అభివృద్ధి పనులను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈర్ల రాంబాబు, టౌన్ ఎస్ఎస్ఎల్ అధ్యక్షులు ఈర్ల రాజేశ్, మండల్ నాయకులు యాకు బాబు, గ్రామ యూత్ నాయకులు బొమ్మకంటీ అజయ్, ఈర్ల రజనీకాంత్, బొమ్మ కంటి బాబు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఈర్ల పవన్ కళ్యాణ్, గ్రామ కమిటీ నాయకులు భాస్కర్ ,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికారులు డిఎస్పి పి. రమేష్ కుమార్, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ కే. శ్రీకాంత్ హాజరై, విద్యార్థులు మరియు సిబ్బందికి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, నేర నియంత్రణ, న్యాయ ప్రక్రియపై అవగాహన కల్పించారు. డ్రగ్స్-రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. రాజేష్, డాక్టర్ బి. శ్రీధర్ రావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.వేణుగోపాల్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# నూతన వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్ పి.భాస్కర్



హనుమకొండ కేయు, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): కాకతీయ విశ్వవిద్యాలయ వ్యాయమ కళాశాల నూతన ప్రిన్సిపాల్ గా వ్యాయమ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్టు) డాక్టర్ పి.భాస్కర్ ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేసారు, డాక్టర్ భాస్కర్ ప్రస్తుత ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఆచార్య టి మనోహర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు, గతం లో కుడా డాక్టర్ భాస్కర్ ఈ కళాశాల కు ప్రిన్సిపాల్ గా పని చేసారు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ భాస్కర్ ను అబినందించారు

# ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవికి షాక్

## ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి

హైదరాబాద్, నవంబర్ 19 (తీన్మార్ న్యూస్): ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవికి మరో బిగ్ షాక్ తగిలింది. ఈ మేరకు అరెస్ట్ అయిన అతడికి నాంపల్లి కోర్టు ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్‌లో కీలక సూత్రధారిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేయగా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఇమ్మడి రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కాగా, కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్‌ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్రధాన నిందితుడు ఇమ్మడి రవిని ఎట్టకేలకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే. ఐ బొమ్మ, బప్పం, ఐ విన్, బప్పం, ఐ రాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు రూపొందించి గత ఏడేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లకు వేదికగా మార్చిన ఇమ్మడి రవి (40)ని శనివారం కూకట్‌పల్లిలో అరెస్ట్ చేశారు. ఇతడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్క్‌లు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను కూడా గుర్తించి. నిందితుడిని బషీర్‌బాగ్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)కు తరలించి కీలక సమాచారం సేకరించారు. ఈ మేరకు బుధవారం నిందితుడిన నాంపల్లి కోర్టులో మరోసారి హాజరుపరిచారు.

# పార్టీలో ఉంటూనే సొంతవారిపై పోస్టులు

- ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు
- కార్యకర్తలకు బీజేపీ చీఫ్ రామ్ హెచ్చరిక



**హైదరాబాద్, నవంబర్ 19:** పార్టీ కార్యకర్తలకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా సరే ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు. టైమ్ కూడా ఇవ్వం అని, అవసరం అయితే జైలుకు పంపిస్తాం అని కార్యకర్తలతో అన్నారు. కొందరు తాము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వంను అస్సలు చంపుకోవద్దని సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. 'పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం, టైమ్ కూడా ఇవ్వం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్స్ ద్వారా బీజేపీపై పోస్టులు పెడుతున్నాయి. పార్టీ నేతలు ఒక మంత్రి దగ్గరకు వెళితే.. పిర్యాదు చేసేందుకు వెళ్లారని రాశారు. ఆ పేపర్ మీద రూ.5 కోట్ల పరువు నష్టం దావా వేశాం. మేము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారు. కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. ఇప్పటికే కేసులు పెట్టాం. పార్టీ మీద ఎవరు పోస్టులు చేసినా కౌంటర్ ఇవ్వండి. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదు. దమ్ముంటే ముందుకు వచ్చి మాట్లాడండి' అని రామచందర్ రావు అన్నారు. 'డబ్బులిస్తే ఏది పడితే అది రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఎవరిని ఉపేక్షించేది లేదు. యూట్యూబ్‌లో మాట్లాడుతున్నారు. ఒకరు దుబాయ్, మరొకరు అమెరికాలో ఉండి తిడుతున్నారు. మీరు ఇండియాకు రండి మీ సంగతి చెబుతాం. పార్టీ కార్యకర్తలను నిర్వీర్యం చేసే ప్రయ ఓత్నం చేస్తున్నారు. పార్టీ నేతలు ఎవరిని ప్రోత్సహించినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సిరియస్ యాక్షన్ ఉంటుంది. నా మీద కూడా ఫేక్ వార్తలు వస్తాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వార్నింగ్ ఇస్తున్నా, మా మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయకండి. సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.. మీ వ్యక్తిత్వంను చంపుకోవద్దని రామచందర్ రావు కోరారు.

# మహిళల హక్కుల బలోపేతానికి కృషి

**రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్క**



**హైదరాబాద్, నవంబర్ 19:** రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిశలా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అన్నారు. మహిళల సమస్యలు అనే అంశంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నేడు బేగంపేటలోని ప్రజా భవన్లో నిర్వహించిన ఒక రోజు రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. పలువురు మహిళా ఐఏఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపే విధంగా నిపుణులు, మేధావులు, అధికారుల సలహాలు తీసుకుంటామని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత విషయంలో ఎన్నో చట్టాలు ఉన్నా.. సమాజ పోకడల వల్ల కొన్నిసార్లు ఆచరణకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోలేని పరిస్థితి కొన్నిసార్లు ఎదురవుతోందని అంటూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళలకు విద్యా, ఉపాధి ఉద్యోగ, భద్రత విషయాల్లో ఎలాంటి ఫెసిలిటీస్ ఇవ్వాలి అన్న అంశాలపై చర్చించి నివేదిక రూపొందించాలని సూచించారు. మహిళా విధానము ఎలా ఉంటే బాగుంటుంది అనే అంశంపై రౌండ్ టేబుల్ కన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకొని, ఇక్కడ వచ్చే సలహాలు, సూచన ప్రాతిపదికగా మరోసారి త్వరలో భారీ సదస్సును నిర్వహిస్తామని సీతక్క వెల్లడించారు. ఉన్నారులు, పిల్లలు, మహిళలు ఉపాధి విద్య అంశాల్లో ప్రభుత్వం ఇంకా ఏమి చేయాల్సి ఉందో తెలుసుకుంటామని చెప్పారు. ఎన్నో ఆటంకాలను చేదించి దేశ ప్రధానిగా ఈ దేశ అభివృద్ధిలో ముద్ర వేసిన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలు ఆత్మగౌరవంతో ఎదగాలనీ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక సాధికారత కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు చట్టాలు, విధానాలు తీసుకొచ్చుకునే విధంగా.. మీరిచ్చే సూచనలు సలహాలు ఉపయోగపడుతుందని, ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఒక చర్చ మాత్రమే కాదు..భవిష్యత్తు మహిళా విధానానికి పునాది వేసే చారిత్రక ఘట్టమని స్పష్టం చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు శైలజా రామయ్యర్, అనిత రామచంద్రన్, దివ్య, దాసరి హరిచందనతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖ మహిళా ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

**ఎలా గెలిచారో రేవంత్‌కు తెలియదా**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

**హైదరాబాద్, నవంబర్ 19 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించుకున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాగంటి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. విషాదంలో ఉన్న హరీశ్‌రావు అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చునన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్టంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్టం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సాంకేతికంగా మాత్రమే కాంగ్రెస్ గెలుపని.. జూబ్లీహిల్స్‌లో నైతిక గెలుపు సునీత, బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్ఎస్ నేతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18వేల ఓట్లు మాత్రమే వచ్చాయని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 75వేల ఓట్లు సంపాదించామని తెలిపారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని కాంగ్రెస్ గుర్తించిందని.. బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని, బీఆర్ఎస్‌ను చూసి కాంగ్రెస్ పార్టీ గడగడలాడిపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, మజ్లిస్ ఒక వైపు, బీఆర్ఎస్ పార్టీ ఒంటరి పోరాటం చేసిందన్న హరీశ్.. అధికార దుర్వినియోగంతో గెలిచిన విషయం రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓడిపోయినా తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిందన్నారు. త్వరలోనే మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. కేటీఆర్, తలసాని సహా తామంతా కలిసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జీహెచ్ఎంసీ, ఇతర ఎన్నికలకు సిద్ధంగా ఉందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# పెరుగుతున్న చలితీవ్రత

**ఏజెన్సీలో మరింత పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్, నవంబర్ 19: రాష్ట్రంలో చలిగాలుల తీవ్ర పెరుగుతోంది. దీనికితోడు రాత్రపూట చలి పెరిగింది. ఏజెన్సీ జిల్లాల్లో చలి పంజావిసురుతోంది. కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 నుంచి 27వరకు తెలంగాణ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. చలికి వర్షాలు తోడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలుంటాయని.. చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.






# పంచాయితీ ఎన్నికలపై కసరత్తు

**నేటినుంచి 23 వరకు ఓటర్ల జాబితా సవరణలు**

**ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ**

**హైదరాబాద్, నవంబర్ 19:** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఇటీవల కేబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. డిసెబర్‌లో ఎన్నికల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో కసరత్తు మొదలయ్యింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల పక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ పక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. గురువారం 20వ తేదీ నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

# లొంగుబాటుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం: బండి



**కరీంనగర్, నవంబర్ 19:** నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగిపోవాలని పదేపదే కేంద్రం హెచ్చరిస్తూ వచ్చిందన్నారు. వారు జనజీవన స్రవంతిలో కలిస్తే మంచి భవిష్యత్ ఉండేదన్నారు. కానీ కొందరు పెడచెవిన పెట్టారని అన్నారు. నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులేనని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాంఅని బండి సంజయ్ అన్నారు. ఆ మేరకు నక్సలిజం అంతం అవుతుందన్నారు. వారికి ప్రజల మద్దతు లేదన్నారు.

# ఇస్లాంలో బలిదానానికి తావులేదు

**ఉమర్‌ది ముమ్మాటికీ ఉగ్రవాదమే ● ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించిన ఓవైసీ**

**హైదరాబాద్, నవంబర్ 19:** ఎర్రకోటవద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ వీడియోలో ఆత్మాహుతి దాడిని బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఉమర్ వ్యాఖ్యలను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఢిల్లీ పేలుళ్ల నిందితుడు ఉమర్ నబీ ఆత్మాహుతి బాంబు దాడిని సమర్థిస్తున్న వీడియో ఒకటి ప్రచారంలో ఉంది. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపం. ఇలాంటి చర్యలు దేశ చట్టాలకు కూడా పూర్తి విరుద్ధం. దీన్ని తప్పుగా అర్థం చేసుకోవడానికి ఏమీ లేదు. ఇది ముమ్మాటికే ఉగ్రవాదమే' అని ఒవైసీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు దేశ రాజధాని సమీపంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, ఢిల్లీ పేలుడుతో ముడిపడి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌పై ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. 'గత ఆరు నెలల్లో స్థానిక కశ్మీరీలు ఎవరూ ఉగ్రవాద సంస్థల్లో చేరలేదని ఆపరేషన్ సిందూర్, మహదేవ్ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు తెలిపారు. మరి ఈ గ్రూపు ఎక్కడి నుంచి వచ్చింది..?' అంటూ ఆయన నిలదీశారు. ప్రస్తుతం ఒవైసీ ట్వీట్ వైరల్ అవుతోంది.

# సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

**అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**హైదరాబాద్, నవంబర్ 19:** నాంపల్లిలోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహా పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. పోలీసుల కళ్లుగప్పి ఆమె ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు.



# కాలం గర్భంలోకి మావోయిస్ట్ పార్టీ!

మావోయిస్టుల చరిత్ర ముగిసినట్లుగానే భావించాలి. ఉవ్వెత్తున ఎగిసిన పీపుల్స్‌వార్ ఇప్పుడు గతచరిత్రగా మిగిలిపోయింది. ప్రజలతో సంబంధాలు, ప్రజల సమస్యలపై పోరాటం ఉన్నంత వరకు వారు బలంగా ఉన్నారు. ప్రజల అండదండ ఉన్నంత వరకు ఉద్యమం బలంగా సాగింది. కానీ కేవలం అడవికే పరిమితమై, ప్రజలకు దూరమైన నేపథ్యంలో వారికి అండదండలు కరువయ్యాయి. కొండపల్లి సీతారామయ్య మొదలు, గణపతి వరకు పీపుల్స్‌వార్ ఉండగా బలమైన విప్లవపార్టీగా వెలుగొందింది. అలాగే గ్రామస్థాయిలో ప్రజల మనన్ననలు పొందింది. ప్రజల సమస్యలపై నిలదీసేలా ఉద్యమాన్ని నిర్మించింది. రాజకీయ నాయకులు గ్రామాలకు వెళ్లాలంటేనే భయపడేలా చేసింది. భూకమందులు పారిపోయి పట్టణాలకు చేరారు. రైతులకు అండగా నిలిచారు. మొత్తంగా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడం, వారికి మేం అండగా ఉన్నామని చెప్పడం ద్వారా బలమైన విప్లవపార్టీగా నిలిచింది. కానీ ప్రజలతో దూరం అయినందున క్రమంగా పార్టీ బలహీనపడుతూ వచ్చింది. అంతెందుకు మావోయిస్ట్ పార్టీగా మారిన తరవాతనే దాని పతనం ప్రారంభమయ్యింది. గ్రామాల్లో మొదలు పట్టణాల్లో కూడా మావోలు దందాలు మొదలు పెట్టారు. కేవలం దందాలు చేసి బెదరించుకునే బ్యాచ్‌గా మారింది. పట్టణాల్లో మావో అగ్రనేతల విలాసాలు బయట పడ్డాయి. పోలీసులకు దొరికిపోయారు. కొందరు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలా ఆ పార్టీలో కల్చర్ మారింది. ప్రజల పక్షాన పోరాడాలన్న లక్ష్యం పోయింది. దీనికితోడు ప్రపంచం మారుతోంది. అడవుల్లో ఉండి పోరాడేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరు. ఎవరికి వారు తమ కెరీర్ కోసం చదువులను కొనసాగించారు. ఒకప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారు పీపుల్స్‌వార్‌కు ఆకర్శితులయ్యారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. సిద్దాంతాలకు ఆకర్శితమై పోరాడే వారు లేరు. ప్రజలు ఏదో పనిచేసుకుని బతికేందుకే సిద్దంగా ఉన్నారు. విదేశీ విద్య అందు బాటులోకి రావడంతో యువత విదేశాల బాట పట్టింది. ఇలా రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. ఉన్నవారు అడవులకు పరిమితం అయ్యారు. అలాగే పోలీస్ నిర్బంధం వల్ల పార్టీ విస్తరణ అన్నది లేకుండా పోయింది. మొత్తంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్‌గా ఉన్న పార్టీ క్రమేణా ప్రాభవం కోల్పోయి మావోయిస్ట్ పార్టీగా మరింత పతనం అయ్యింది. అగ్రనేతల దూరదృష్టి లోపం, విభేదాలు, లొంగుబాట్లు ఇలా అంతా కలసి నిర్వీర్యం అయ్యింది. దీనికితోడు పోలీస్ నిర్బంధం పెరిగింది. గతంలో కూడా నిర్బంధం ఉన్నా ప్రజలు తమ కడుపులో పెట్టుకుని దాచుకున్నారు. ఇకపోతే నమ్ముకున్న గిరిజనులను ఇన్‌ఫార్మర్ల పేరుతో మట్టుపెట్టారు. కిరాతక హత్యలకు పాల్పడ్డారు. గొడ్డలితో నరికి వేయడం,కాళ్లూ చేతులు నరకడం వంటి కిరాతక చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు ఎంతగా హింసకు పాల్పడ్డారో అంతకు మించి అన్నట్లుగా నక్సల్స్ హింససాగింది. వారి పతనావస్థకు ఇవన్నీ కారణాలుగానే చూడాలి. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్‌తో అగ్రనేతలంతా మట్టికరిచినట్లే. కొందరు లొంగిపోయారు. మరికొందరు నేలకొరిగారు. ఇటీవల మల్లోజుల తదితర అగ్రనేతలు లొంగిపోవడం కూడా ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించు కునేందుకే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఇన్నేళ్ల సుదీర్ఘ పోరాటంలో మావోయిస్టులు సాధించిందేమీ లేదు. వేలాదిమందిని వారు పొట్టన పెట్టుకున్నారు. అలాగే వేలాదిమంది మావోలు కూడా మృత్యువాత పడ్డారు. చివరకు ఉద్యమపార్టీ సాధించింది సున్నా అనే చెప్పాలి. మారేడిమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు చనిపోయిన క్రమంలో ప్రతి ఒక్కరూ అవలోకన చేసుకోవాలి. అడవుల బాట పట్టిన మావోల కారణంగా ఎందరో జీవితాలు నాశనం అయ్యాయి. ఎందరో తమ వృత్తిని, చదువును వదిలి పోరాటంలో దూకడంతో కుటుంబాలను రోడ్డున పడేశారు. వందలాదిమంది తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారు. తాజాగా మారేడిమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్ కౌంటర్‌లో తప్పించుకున్న ఆరుగురు కూడా హతమయ్యారని అధికారులు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారాన్ని పోలీసులు ఖండించారు. అయితే పోలీసులు పట్టుబట్టి అడవులను జల్లెడ పడుతున్నారు. దీంతో వారు తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. అందుకే పోలీస్ తూటాలకు నేలకొరగక తప్పడం లేదు. పీపుల్స్‌వార్ ఒక సిద్దాంతం కోసం ఆవిర్భవించింది. ఒక నిబద్దతో పనిచేసింది. ప్రజల సమస్యలపై పోరాటం, రాజకీయ అవినీతిపై నిక్కచ్చిగా పోరాడింది. ప్రజలకు అండగా నిలిచింది. పెత్తందార్లు భరతం పట్టింది. అక్రమాలను నిలదీసింది. భూస్వామ్య విధానాలపై పోరాడింది. కానీ అవేవీ ఇప్పుడు నిలవలేదు. పీపుల్స్‌వార్ ఉన్నంత కాలం గ్రామస్థాయిలో కొంత భయం ఉండేది. ఎక్కడ వారికి తెలిస్తే తమను చంపేస్తారేమో అన్న భయం ఉండేది. అయితే ఇన్నేళ్ల పోరాటంలో ఏం సాధించా రన్నది ప్రశ్న. ఈ ప్రశ్న ప్రతి ఒక్కరూ వేసుకోవాలి. పాటలు, రెచ్చగొట్టే ప్రసంగాలతో అప్పట్లో మావోల్లో చేరడానికి చాలామంది వచ్చేవారు. పశువుల కాపరులు కూడా దళాల్లో చేరారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రాజ్యం ఎప్పుడూ బలవంతమనైదని గుర్తించాలి. ప్రజల అండకూడా లేకపోవడంతో మావోల అణచివేత ప్రభుత్వాలకు సులువుగా మారింది. కాలానుగుణంగా టెక్నాలజీ మారింది. యువత కెరీర్ కోసం దేశం విడిచి పోతున్నారు. చదువుకోకుండా మావోల్లో చేరేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరు. ఈ పరిణామాలన్నీ మావోలు బలహీనపడడానికి కారణం అయ్యాయి. వెరసి మావోయిస్టులను ఏరిపారేయడం ప్రభుత్వాలకు సులువుగా మారింది. ఇకపోతే ఆధునిక కాలంలో మారిన పరిస్థితుల్లో మావోల పాత్ర కూడా లేకుండా పోయింది. అందుకే క్రమేపీ వారి ప్రాబల్యం తగ్గడంతో పాటు, అంతర్థానానికి కారణమయ్యింది. అందుకే వారి పోరాటాలకు ఆదరణ లేకుండా పోయింది. నిజానికి వారు పోరాడుతున్నది కూడా ఏమీ లేదు. అలాంటప్పుడు వారు అడవుల్లో ఇంకా ఉండడం దండగ. ఉన్నవారు లొంగిపోతే ప్రాణాలైనా దక్కుతాయి. అడవిలో ప్రశాంతత ఉంటుంది. సిద్దాంతలకు విలువ లేనప్పుడు అది ఏ పార్టీ అయినా పతనం కావాల్సిందే. రాజకీయ పార్టీ అయినా, పీపుల్స్ పార్టీ అయినా చరిత్రలో కనుమరుగు కావాల్సిందే. ఇప్పుడు అదే జరుగుతోంది.

# అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

**ఆయన భౌతికంగా లేకున్నా మనతోనే ఉన్నారు**

**ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచాయి**

**సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ప్రధాని**



**పుట్టపర్తి, నవంబర్ 19:** సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్థిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్,నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు.ప్రేమ, శాంతితో కూడిన వసుదైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలందించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారనిపేర్కొన్నారు.

**సర్వమానవ సంక్షేమమే బాబా ధ్యేయం**

విశ్వశాంతి, సర్వమానవ సంక్షేమమే సత్యసాయి బాబా మార్గమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భూమిపై మనకు తెలిసిన.. మనం చూసిన దైవస్వరూపం సత్యసాయిబాబా అని కొనియాడారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో చంద్రబాబు మాట్లాడారు. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్, పలువురుమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, ఆస్పత్రులు, నీటి ప్రాజెక్టులు, సేవా సంస్థలు ద్వారా వేలాది మందికి ప్రాణాధారం అయ్యారని తెలిపారు. భక్తులపై అపారమైన ప్రేమ చూపిన సత్యసాయి బాబా, వారిని ఎల్లప్పుడూ 'బంగారూ' అని పిలిచేవారని సీఎం గుర్తుచేశారు. అది ఆయన హృదయపూర్వక ప్రేమకు ప్రతీక అని వ్యాఖ్యానించారు. 'సత్యసాయి సిద్ధాంతం అందరూ అర్థం చేసుకోవాలి' సూచించారు.. ప్రపంచమంతా ప్రేమను పంచారు.. విదేశాలకు వెళ్తే చాలా మంది ఆయన గురించి చెబుతారని తెలిపారు.. 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారిన గుర్తించారు.. ఏకంగా 102 విద్యాలయాలు నెలకొల్పారు.. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారని.. ఏకంగా 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోందని తెలిపారు సీఎం నారా చంద్రబాబు నాయుడు..

**బాబా సేవలు చిరస్మరణీయం: ఐశ్వర్యా రాయ్**

సత్యసాయి శతజయంతికి తనను ఆహ్వానించడం గౌరవంగా భావిస్తున్నానని నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ పేర్కొన్నారు.. సత్యసాయి బోధనలు ప్రపంచానికి మార్గదర్శనం చేశాయన్నారు.. సత్యసాయి ట్రస్ట్ ఎన్నో విద్యా సంస్థలు పెట్టి పేదలకు ఉచిత విద్య అందిస్తోందని కొనియాడారు. తాజాగా సత్యసాయి శతజయంతి ఉత్సవ కార్యక్రమంలో ఐశ్వర్యరాయ్ ప్రసంగించారు. ప్రజలకు సత్యసాయి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సత్యసాయి జన్మించి వందేళ్లు గడిచింది. ఆయన భౌతికంగా మనతో లేకపోయినా.. లక్షలాది మంది గుండెల్లో ఎప్పుడూ కొలువై ఉంటారు. బాబా నేర్పిన పాఠాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. సత్యసాయి బాబా ఆచరించిన విధానాలు ఎప్పటికీ మనతోనే ఉంటాయన్నారు. ఆయన ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు. 'నిజమైన నాయకత్వం అంటే భగవంతుడికి, ప్రజలకు సేవ చేయడం' అని వివరించేవారని గుర్తు చేసుకున్నారు. సత్యసాయి ఛారిటీ చేస్తున్న సేవలను కొనియాడుతూ.. ఈ ఛారిటీ ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా విద్య అందుతోందని తెలిపారు. సత్యసాయి ట్రస్ట్ ద్వారా నెలకొన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వందలాది మంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు.

## పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ


**చెన్నై, నవంబర్ 19:** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం- కిసాన్ నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం కింద 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా నిధులు జమకానున్నాయి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైంది. పీఎం కిసాన్ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో రూ.3.70 లక్షల కోట్లకు పైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. భూమి వివరాలు పోర్టల్‌లో నమోదై ఉండి, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉన్న రైతులకు పథకం ప్రయోజనాలు అందుతున్నాయి.

# విరాళ రూపంలో 415 కోట్లు వసూలు


**అక్రమంగా నిధులు సమీకరించినట్లు ఆరోపణలు**

**కస్టడీకి అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు ఛైర్మన్ సిద్దిక్**

**విచారణలో పలు కీలక ఆధారాల సేకరణ**



**న్యూఢిల్లీ, నవంబర్ 19:** అల్ ఫలాహ్ గ్రూపు ఛైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిక్‌కు విరాళాల రూపంలో 415 కోట్లు అందినట్లు ఈడీ పేర్కొన్నది. తన ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి అక్రమ రీతిలో ఆ నిధులను సమీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గల్ఫ్‌లో ఫ్యామిలీ సభ్యులు స్థిరపడడం వల్ల అక్కడికి పారిపోయే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. ఫరీదాబాద్‌లో రోజంతా జరిగిన తనిఖీల తర్వాత అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు ఛైర్మన్ సిద్దిక్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన జరిగిన ఎర్రకోట కారు పేలుడు ఘటనతో వర్సిటీకి లింకు ఉన్న కారణంగా ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. 13 రోజుల పాటు ఈడీ కస్టడీకి ఆయన్ను అప్పగించారు. తప్పుడు అక్రెడిటేషన్, గుర్తింపు చూపిస్తూ విద్యార్థులు, పేరెంట్స్ నుంచి ఆ వర్సిటీ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రూపంలోనే 415 కోట్లు సేకరించినట్లు తెలుస్తున్నది. పరారీ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అతన్ని కస్టడీలోకి తీసుకుంటున్నట్లు ఈడీ పేర్కొన్నది. 1990 నుంచి అల్ ఫలాహ్ వర్సిటీ అంచలంచెలుగా ఎదిగిందని, ఇప్పుడు ఓ పెద్ద విద్యాసంస్థగా మారినట్లు తెలిపింది. అల్-ఫలా యూనివర్సిటీపై మంగళవారం ఈడీ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యూనివర్సిటీ తప్పుడు అక్రిడిటేషన్ ఆధారంగా విద్యార్థుల నుంచి మొత్తం రూ.415.10 కోట్లు వసూలుచేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపినట్లు గుర్తించామన్నారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విశ్వవిద్యాలయాన్ని నిర్వహిస్తూ.. ఫీజులు వసూలుచేస్తున్నట్లు ఆరోపించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీల ప్రాంగణంలో దాడుల అనంతరం మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్ధిఖీని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు. సోదాల్లో రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు తెలిపారు. 2014-15 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్నులలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా సంపాదిస్తున్న ఈ నిధులను ఎక్కడికి మళ్లిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేధించిన సంగతి తెలిసిందే. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. దీంతో దీని పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం అల్-ఫలా విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో దిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట ఇవి నమోదయ్యాయి. మరోవైపు.. విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది.




# అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లకు ఇక మోక్షం

**బ్యాంకులో వివరాలు సమర్పించి పొందవచ్చు**

**ముంబై, నవంబర్ 19:** బ్యాంకులు, లేదా నాన్ బ్యాంకింగ్ సంస్థల్లో మదుపు చేసి మర్చిపోయిన, లేదా మిగులు సొత్తు మీకు దక్కే ఛాన్స్ ఇప్పుడు వచ్చింది. కేంద్రం ఇటీవల ఈ సొమ్ములు తీసుకునేందుకు చాలా సులువైన వెసులుబాటు కల్పిస్తోంది. ఈ సొత్తుకు మీరు హక్కుదారులు, లేదా వారసులైన ఎడల నిరూపయోగంగా బ్యాంకుల్లో ఉండిపోయిన సదరు సొమ్ములు చాలా సులభంగా మీ చేతికి వస్తాయి. బ్యాంకుల్లో మిగిలిన చిన్న మొత్తాలు, డిపాజిట్లు, ఇలా ఎన్నో వివరాల గురించి చాలా మందికి తెలియక పోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. భారత రిజర్వ్ బ్యాంక్ ప్రకారం, బ్యాంకు ఖాతాల్లో 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం అలా మిగిలిన డబ్బులు 'అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు'గా పరిగణించబడతాయి. ఇవి సేవింగ్స్, కరెంట్ అకౌంట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, లోన్ బ్యాలెన్స్‌లు, చెక్‌లు, ట్రాన్స్‌ఫర్లు, ప్రీపెయిడ్ కార్డుల్లో మిగిలిన మొత్తాలు లేదా విదేశీ కరెన్సీ డిపాజిట్లు కూడా ఉండవచ్చు. ఇటువంటి మొత్తాలు బ్యాంకులు నెలవారీగా సమీక్షించి, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌కి బదిలీ చేస్తాయి. ఈ సొమ్ములే ఇప్పుడు అర్హులైన వారికి అందజేసేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి గత నెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఒక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ పక్రియ చాలా సులభం, ఇంకా వేగవంతం కూడా. మీ బ్యాంకు ఖాతా వివరాలను చూసుకోండి. బ్యాంకు వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ అయి, పాత ఖాతాలు లేదా మెచ్యూరిటీ పూర్తయిన ఈఆలను తనిఖీ చేయండి. ఖీఃఎ వెబ్‌సైట్‌లో ఆఇం సెక్షన్‌లో కూడా మీరు చెక్ చేయవచ్చు. లేని పక్షంలో బ్యాంకు బ్రాంచ్‌లో సహాయం తీసుకోచ్చని ఆర్‌బిఐ సూచించింది.

# రెండో టెస్టులో గిల్ ఆడతాడా?




భారత్, సౌత్ ఆఫ్రికా మధ్య రెండవ టెస్ట్ నవంబర్ 22న గౌహతిలో ప్రారంభం కానుంది. అంతకుముందు టీమిండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ టెస్టులో టీమ్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడటం దాదాపుగా కష్టమని తెలుస్తోంది. కోల్‌కతా టెస్టు సందర్భంగా అతనికి నెక్ స్ప్యాజమ్ వచ్చింది. దీని వల్ల గిల్ ఆసుపత్రిలో కూడా చేరాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ మధ్యలోనే రిటైర్డ్ హర్ట్ గా వెళ్లిపోయిన గిల్ రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్‌కు దిగలేదు. ఇప్పుడు గిల్ నవంబర్ 18న ఈడెన్ గార్డెన్స్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు. కెప్టెన్ కోలుకోవడానికి ఇంకా 5 నుండి 7 రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. గిల్ కోలుకుంటున్నాడని తెలిపిన బోర్డు.. రెండో టెస్టులో ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం, శుభ్‌మన్ గిల్ జట్టుతో గౌహతికి వెళ్తాడు అని బీసీసీఐ తెలిపింది. కానీ జట్టుతో పాటు గౌహతికి వెళ్లినా కూడా రెండో టెస్టులో గిల్ ఆడకపోవచ్చు. తనకు ఇప్పుడు విశ్రాంతి అవసరం. రెండో టెస్టులో గిల్ ఆడటంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బోర్డు పేర్కొంది. గిల్ ఆడకపోతే, రిషబ్ పంత్ రెండో టెస్టులో కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది. టీమ్ మేనేజ్‌మెంట్ పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటుంది. అయితే భారత్ ప్లేయింగ్ XIలో పెద్ద మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉందని సంకేతాలు స్పష్టంగా ఉన్నాయి. యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని అధికారికంగా టెస్ట్ జట్టులోకి చేర్చుకుంది. ఈడెన్ గార్డెన్స్ టెస్టుకు ముందు నితీష్ ను రిలీజ్ చేసింది. తద్వారా అతను ఇండియా A జట్టులో భాగం అయ్యాడు. గౌహతి టెస్టులో గిల్ అందుబాటులో ఉండటం అనుమానంగా మారడంతో సెలెక్టర్లు వెంటనే నితీష్ రెడ్డిని తిరిగి పిలిపించారు. నవంబర్ 18న జట్టు ప్రత్యామ్నాయ శిక్షణా శిబిరంలో నితీష్ రెడ్డి పాల్గొన్నాడు. అతడు జట్టులో చేరడంతో భారత్ ప్లేయింగ్ ఎలెవన్ లో మార్పులు చేయడం ఖాయం. గిల్ ఆడకపోతే నితీష్ రెడ్డికి నేరుగా ప్లేయింగ్ XIలో అవకాశం లభిస్తుంది. సీనియర్లు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు. నితీష్ రెడ్డి తన టెస్ట్ కెరీర్‌లో 9 మ్యాచ్‌లు ఆడి 386 పరుగులు చేశాడు. ఇందులో ఒక అద్భుతమైన సెంచరీ ఉంది. అది కూడా ఆస్ట్రేలియాపై చేయడం విశేషం. బౌలింగ్‌లో 8 వికెట్లు తీశాడు. 2024లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత ఈ తెలుగు తేజం నిరంతరం భారత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఫోకస్‌లో ఉన్నాడు. గిల్ అందుబాటులో లేకపోతే కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. లేనిపక్షంలో రాహుల్ కు తాత్కాలిక కెప్టెన్సీ బాధ్యత అప్పగించే అవకాశం లేకపోలేదు.

# చరిత్ర సృష్టించిన డారిల్ మిచెల్

## వన్డేల్లో నంబర్-1 బ్యాటర్‌గా రికార్డు

అంతర్జాతీయ క్రికెట్ మండలి బుధవారం మధ్యాహ్నం వన్డే, టెస్టు ఫార్మాట్‌లకు సంబంధించిన తాజా ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో ఒక చారిత్రక మార్పు జరిగింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ మూడు వారాల పాటు కొనసాగిన నంబర్-1 వన్డే బ్యాటర్ స్థానాన్ని కోల్పోయాడు. న్యూజిలాండ్‌కు చెందిన డాషింగ్ బ్యాట్స్‌మెన్ డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకోవడంతో 46 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన ఒక ఆటగాడు వన్డేల్లో నంబర్-1 బ్యాటర్‌గా నిలిచాడు. మరోవైపు టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో మాత్రం టీమిండియా స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్, వెస్టిండీస్‌తో నవంబర్ 16న జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో 119 పరుగుల అద్భుతమైన సెంచరీతో అదరగొట్టాడు. ఈ ప్రదర్శన అతనికి ర్యాంకింగ్స్‌లో భారీగా కలిసొచ్చింది. మిచెల్ ఏకంగా నంబర్-1 స్థానానికి చేరుకోవడం ద్వారా 1979లో గ్లెన్ టర్నర్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. దురదృష్టవశాత్తు, మిచెల్ నడుము నొప్పి కారణంగా ఈ సిరీస్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. మరోవైపు, పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగులు చేయడం వలన, ఆరు స్థానానికి చేరుకోగా, మహ్మద్ రిజ్వాన్ 22వ స్థానానికి, ఫఖర్ జమాన్ 26వ స్థానానికి ఎగబాకారు. వన్డే ఫార్మాట్‌లో బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ తన నంబర్-1 స్థానాన్ని కొనసాగించాడు. పాకిస్తాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో 3 వికెట్లు పడగొట్టి 11 స్థానాలు ఎగబాకి ఏకంగా 9వ స్థానానికి చేరుకున్నాడు.



అలాగే, పాకిస్తాన్ పేసర్ హారిస్ రవూఫ్ 5 స్థానాలు మెరుగుపరుచుకుని 23వ స్థానంలో ఉన్నాడు. వెస్టిండీస్‌కు చెందిన జాయ్‌డెన్ సీల్స్, రోస్టన్ చేజ్ కూడా ర్యాంకింగ్స్‌లో మెరుగుదల సాధించారు. టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా మొత్తం 6 వికెట్లు పడగొట్టడం వలన ఈ స్థానం పదిలమైంది. భారత స్పిన్నర్లలో కూడా మంచి పురోగతి కనిపించింది. కుల్‌దీప్ యాదవ్ రెండు స్థానాలు పైకి వచ్చి తన కెరీర్‌లో అత్యుత్తమంగా 13వ స్థానాన్ని చేరుకోగా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నాలుగు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో ఉన్నాడు. సౌతాఫ్రికా ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ ఈడెన్ గార్డెన్స్‌లో 8 వికెట్లు తీయడంతో 20 స్థానాలు పైకి వచ్చి 24వ స్థానంలో నిలిచాడు.

# కామెరాన్ గ్రీన్‌పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్

సన్ రైజర్స్ హైదరాబాద్.. మినీ వేలంలో పోటీకి సిద్ధమైంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కోరుతున్న ఆ ప్లేయర్ కోసం గట్టిగా పోటీ పడనుంది. ఐపీఎల్ ఫ్రాంచైజీలన్నీ కూడా తమ కోర్ టీంపై నమ్మకాన్ని ఉంచాయి. ముఖ్యంగా బెంచ్‌కే పరిమితమైన ప్లేయర్స్, నిలకడలేమి ఆటగాళ్లకు గుడ్ బై చెప్పేయడానికి సిద్ధమయ్యాయి. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్‌ను ముంబై టీంకు ట్రేడ్ చేసి.. రోహిత్ శర్మను తీసుకుంటుందని.. అలాగే హెన్రిచ్ క్లాసెన్‌ను వేలంలోకి వదిలేసి.. మళ్లీ కొనుగోలు చేస్తుందని టాక్ వినిపించింది. అయితే వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ కావ్యపాప.. తన కోర్ టీంపై మళ్లీ భరోసాతో ముందుకు వెళ్తోంది. కావ్యా పాప కోర్ టీం విషయానికొస్తే.. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ కచ్చితంగా మరోసారి ఓపెనింగ్ బ్యాటర్లుగా బరిలోకి దిగనున్నారు. అలాగే మిడిలార్డర్‌లో ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ ఉండకనే ఉన్నారు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి, అనికేట్ దిగనుండగా.. వీరికంటే ముందు మరో ఆల్‌రౌండర్- కమ్ ఫినిషర్ రోల్ కోసం ఓ ప్లేయర్‌ను వేలంలో కొనుగోలు చేయడానికి హైదరాబాద్ యాజమాన్యం ఆసక్తిగా చూస్తోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా అతడి కోసం కోట్లు అయినా ఖర్చు చేయాలని చెప్పాడట. అతడెవరో కాదు.. కామెరాన్ గ్రీన్. గాయం నుంచి కోలుకున్న ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్.. అటు వన్డేలు, ఇటు టీ20ల్లో దుమ్ములేపుతున్నాడు. అలాగే మరికొన్ని రోజుల్లో యాషెస్ టెస్ట్ సిరీస్ ప్రారంభం అవుతుండటంతో.. అందరి ఫోకస్ అతడిపైనే పడింది. ఇక్కడ కామెరాన్ గ్రీన్ కోసం హైదరాబాద్‌కు మినీ వేలంలో గట్టి పోటీ ఎదురయ్యేలా కనిపిస్తోంది. అటు కేకేఆర్, చెన్నై కూడా ఈ ఆల్‌రౌండర్ కోసం పోటీ పడుతున్నాయి. మరి ఎవరికి దక్కుతాడో చూడాలి.



# నంబర్ 1 స్థానం కోల్పోయిన రోహిత్ శర్మ

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మకి అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో స్వల్ప షాక్ తగిలింది. కేవలం మూడు వారాల పాటు నంబర్-1 స్థానంలో కొనసాగిన రోహిత్ శర్మ, ఆ కిరీటాన్ని ఇప్పుడు కోల్పోయాడు. ఆస్ట్రేలియా పర్యటనలో హాఫ్ సెంచరీ, సెంచరీ ఇన్నింగ్స్‌ల ద్వారా నంబర్-1 స్థానానికి చేరుకున్న రోహిత్, తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయాడు. అయితే రోహిత్ శర్మను వెనక్కి నెట్టిన ఆ న్యూజిలాండ్ బ్యాటర్, అతడి కంటే కేవలం ఒక్క పాయింట్ మాత్రమే ముందుండటం విశేషం. ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన మొదటి వన్డేలో మిచెల్ సెంచరీ (119 పరుగులు, 118 బంతులు) చేయడంతో, ఈ ప్రదర్శన అతడికి ర్యాంకింగ్‌లో బాగా కలిసొచ్చింది. అంతకుముందు మూడో స్థానంలో ఉన్న మిచెల్, ప్రస్తుతం 782 రేటింగ్ పాయింట్స్ తో నంబర్-1 స్థానాన్ని దక్కించుకున్నాడు. రోహిత్ శర్మ ఇప్పుడు 781 రేటింగ్ పాయింట్స్ తో రెండో స్థానానికి పడిపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ మూడో స్థానంలో ఉన్నాడు. డారిల్ మిచెల్ అగ్రస్థానానికి చేరుకోవడం న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన రికార్డు. ఎందుకంటే సుమారు 47 సంవత్సరాల తర్వాత న్యూజిలాండ్‌కు చెందిన ఒక బ్యాటర్ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఇంతకుముందు 1979 సంవత్సరంలో గ్లెన్ టర్నర్ నంబర్-1 వన్డే బ్యాటర్‌గా నిలిచాడు. డారిల్ మిచెల్ ఈ ఏడాది (2025) అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ సంవత్సరం 16 ఇన్నింగ్స్‌లలో 54.35 సగటుతో 761 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ వన్డే ర్యాంకింగ్‌లో కేవలం ఒక్క పాయింట్ తేడాతో వెనుకబడటం వలన నంబర్-1 స్థానాన్ని తిరిగి దక్కించుకోవడానికి అతనికి వెంటనే ఒక చక్కటి అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి భారత్, సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలోనూ రోహిత్ శర్మ మంచి ప్రదర్శన చేస్తే, డారిల్ మిచెల్‌ను దాటి మళ్లీ అగ్రస్థానాన్ని సొంతం చేసుకోవడం ఖాయం. రోహిత్ శర్మ ప్రస్తుతం టీ20, టెస్ట్ ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ తీసుకుని కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ (782), రోహిత్ శర్మ (781) మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఆ తర్వాత, ఇబ్రహీం జద్రాన్ (764), శుభమాన్ గిల్ (745), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. శ్రీలంక ఆటగాడు చరిత్ అసలంక 3 స్థానాలు దిగజారి తొమ్మిదో స్థానానికి పడిపోవడం వలన బాబర్ ఆజం (ఆరో స్థానం) ప్రయోజనం కలిగింది.







# భారత్‌కు ఘోర పరాజయం..!

## 2-1తో భారత్-ఏ జట్టు సిరీస్ కైవసం

సౌతాఫ్రికా-ఏతో అనధికార మూడు వన్డేల సిరీస్‌లో భారత్-ఏకు ఘోర పరాజయం ఎదురైంది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో తిలక్ వర్మ సారథ్యంలోని భారత్-ఏ జట్టు 72 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్‌ను భారత్-ఏ జట్టు 2-1తో కైవసం చేసుకుంది. ఆఖరి అనధికార వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 325 పరుగుల భారీ స్కోర్ చేసింది. లుహన్ డ్రీ ప్రిటోరియస్(98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 123), రివల్డో మూన్‌సమీ(130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 107) సెంచరీలతో రాణించారు. భారత్-ఏ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా రెండేసి వికెట్లు తీసారు. అనంతరం భారత్ 49.1 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని(66 బంతుల్లో 8 ఫోర్లతో 66), ఇషాన్ కిషన్(67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ తిలక్ వర్మ(11), అభిషేక్ శర్మ(11), రుతురాజ్ గైక్వాడ్(25) దారుణంగా విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో పీటర్(4/48) నాలుగు వికెట్లు తీయగా.. మోరెకి(2/56) రెండు వికెట్లు పడగొట్టాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌కు సన్నాహకంగా ఈ మూడు అనధికార వన్డేలను నిర్వహించారు. ఈ టోర్నీలో రాణించిన ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో చోటు దక్కే ఛాన్స్ ఉంది. ఈ సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ 117, 68 పరుగులతో రాణించాడు. అతనికి సౌతాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో అవకాశం దక్కవచ్చు. ఈ మూడు వన్డేల్లో తిలక్ వర్మ, అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చారు. నవంబర్ 30 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. తొలి వన్డే రాంచీ వేదికగా జరగనుండగా.. రెండో వన్డే డిసెంబర్ 3న రాయ్‌పూర్, డిసెంబర్ 6న వైజాగ్ వేదికగా మూడో వన్డే జరగనుంది.

# అండర్-19 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల

అంతర్జాతీయ క్రికెట్ మండలి వచ్చే ఏడాది జరగబోయే అండర్-19 పురుషుల ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఒక ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకుంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్‌ల మధ్య గ్రూప్ దశలో ఎలాంటి పోరు ఉండబోదు. ఈ టోర్నమెంట్ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించగా ఇందులో రెండు దేశాలను వేర్వేరు గ్రూపుల్లో ఉంచడం గమనార్హం. సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా భారత్, పాకిస్తాన్‌ల మధ్య రాజకీయ సంబంధాలు క్షీణించాయి. దీంతో తరచూ రెండు దేశాల మ్యాచ్‌లను నిలిపివేయాలని డిమాండ్లు వినిపిస్తున్నప్పటికీ ఇటీవల జరిగిన ఐసీసీ మహిళల ప్రపంచ కప్, వచ్చే ఏడాది జరగబోయే పురుషుల టీ20 ప్రపంచ కప్‌లలో కూడా ఈ రెండు టీమ్స్ మ్యాచ్‌లకు ఐసీసీ ఆమోదం తెలిపింది. అయితే అండర్-19 స్థాయిలో మాత్రం ఐసీసీ ఈ రెండు టీమ్స్‌ను వేర్వేరు గ్రూపుల్లో ఉంచి, గ్రూప్ దశలో అవి తలపడకుండా చేసింది. గత రెండు అండర్-19 ప్రపంచ కప్‌లలో కూడా భారత్-పాక్ వేర్వేరు గ్రూపుల్లోనే ఉ ఒడటం గమనార్హం. ఐసీసీ బుధవారం (నవంబర్ 19) నాడు ఈ వరల్డ్ కప్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ టోర్నమెంట్ నమీబియా, జింబాబ్వే దేశాల్లో జరగనుంది. వన్డే ఫార్మాట్‌లో జరిగే ఈ ప్రపంచ కప్ జనవరి 15న మొదలై, ఫిబ్రవరి 6న ఫైనల్‌తో ముగుస్తుంది. టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి, వీటిని 4-4 జట్లతో నాలుగు గ్రూపులుగా విభజించారు.



## వారణాసి నుంచి రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

## డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి

### సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి



ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'అరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. ఆనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు.విశ్వనాథ్ సినిమాల్లో ఎక్కువగా నటించిన తులసికి బాలనటిగా శంకరాభరణం ఎనలేని కీర్తిని తీసుకు వచ్చింది. ఆ తర్వాత చిరంజీవి హీరోగా వచ్చిన శుభలేఖ సినిమాలో సుధాకర్‌కు జోడీగా మెప్పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



## ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

## మరో వివాదంలో నటుడు ధనుష్

### టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు





నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్ల అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళు,, 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.

## నిన్న అదితి..నేడు శ్రియా

### నకిలీ వాట్సప్ క్రియేట్ చేసిన దుండగులు



నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463